క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు కోరారు. పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు పీఆర్‌టీయూలో చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భైరి అప్పారావు పాల్గొని మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు, నాయకులు పామర్తి ఏసురాజు, కీమ్యా రాము, ఎం.రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా కోనా


నియామకపత్రాన్ని అందుకుంటున్న కోనా హనుమాన్‌బాబు

ఉంగుటూరు: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా కైకరానికి చెందిన కోనా హనుమాన్ బాబు నియమితులయ్యారు. శనివారం కైకరంలో ఆర్యవైశ్య మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా కోనా హనుమాన్‌బాబు, పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా నున్న ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా నున్న బాలత్రిపుర సుందరావును నియమించారు. ఏపీ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు నియామక పత్రాలను వారికి అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: కొవ్వలిలో అనారోగ్యంతో వైద్య సేవలు పొందుతున్న వైఎస్సార్ సీపీ నేత కొవ్వలి సొసైటీ మాజీ చైర్మన్ సునీల్ రాజాను, రోడ్డు ప్రమాదంలో గాయపడిన పూజారి ఆనంద్‌ను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, కొవ్వలి సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు ఉన్నారు.



రక్తదానం చేస్తున్న కార్యకర్తలను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాని



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ నూర్జహాన్ దంపతులు, వీవీనగర్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ మైబాబు

జన హృదయ నేత వైఎస్సార్

- ఘన నివాళి అర్పించిన ఎమ్మెల్యే నాని
- వాడవాడలా వేడుకలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సుస్థిర పాలనతో ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్ 74వ జయంతి వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా పేదల బతుకుల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చిన నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందిందన్నారు. వైఎస్సార్ ఆశయాలే స్ఫూర్తిగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని, వాటిని ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారని చెప్పారు. ప్రజల అండతో మరింత ఉత్సాహంతో ప్రజాసేవకు పునరంకితం అవుతామన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ విజయకేతనం ఎగురు వేస్తామని దీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధమని అన్నారు. ప్రతిపక్షాలకు ప్రజల సంక్షేమం పట్టదని, రాజకీయంగా తమకు మనుగడ లేదనే భయంతో దుష్టశక్తులన్నీ ఏకమై నైతిక విలువలకు తిలోదకాలిచ్చి జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగతంగా దాడికి పాల్పడుతున్నాయని ఆరోపించారు. తొలుత స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల, ఫైర్ స్టేషన్ కూడళ్లలో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


సత్రంపాడులో వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి

స్వర్ణాంధ్ర రూపశిల్పి రాజన్న

ఆంధ్రప్రదేశ్‌ను మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తన పరిపాలనా దక్షతతో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చారని నగర మేయర్ షేక్ నూర్జహాన్ గుర్తుచేశారు. స్థానిక వీవీఆర్ నగర్‌లో బెయిలీ బ్రిడ్జి వద్ద ఉన్న రాజన్న విగ్రహానికి నూర్జహాన్, పెదబాబు దంపతులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ వైఎస్సార్ బాటలో ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.


మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

రైతు బాంధవుడు వైఎస్

మహానేత రాశేఖరరెడ్డి రాష్ట్రంలో రైతు బాంధవుడుగా పేరుగాంచారని కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు పేర్కొన్నారు. రామచంద్రరావు పేట విజయ విహార్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానికులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లంకా రామ్మోహన్, దండుబోయిన చంద్రశేఖర్, గౌడ రంగబాబు, తాళ్ళూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


15వ డివిజన్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసిన కార్పొరేటర్ రాము

రాజన్న సేవలు మరువలేం

ఏలూరు రూరల్ : మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు ఎన్నటికీ మరువలేరని ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు కొనియాడారు. శనివారం వైఎస్సార్ జయంతిని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వీవీ నగర్‌లో నిర్వహించిన వేడుకలో మైబాబు మాట్లాడారు. పార్టీ నాయకులతో కలిసి వైఎస్ విగ్రహానికి పూలమాల వేశారు. కేక్ కట్ చేశారు.

- సత్రంపాడు ప్రధాన కూడలిలో వైఎస్ విగ్రహం వద్ద నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, డాక్టర్ దిరిశాల ప్రసాద్, అనిల్ కుమార్ తదితరులు నివాళులర్పించారు.

పేదల గుండెల్లో నిలిచిన వైఎస్సార్


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో) : పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. వైఎస్సార్ జయంతి కార్యక్రమం శనివారం ఉదయం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలోని వైఎస్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ మహానేత వైఎస్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్ రాజు మాట్లాడుతూ జెడ్పీ యాజమాన్యంలో పనిచేసే ఉద్యోగులందరూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా జీతభత్యాలు తీసుకునే వారని అప్పట్లో ఏడాదికి ఆరేడు నెలలు మాత్రమే జీతాలు అందుకునేవారని గుర్తుచేశారు. ఈ పద్ధతిని మార్పు చేసి 010 పద్దు ద్వారా జీతాలు పెంచిన మహానుభావుడు వైఎస్ అని కొనియాడారు. ఈ సందర్భంగా తొమ్మిది రకాల పూలు, తొమ్మిది రకాల పండ్లను వైఎస్ విగ్రహం వద్ద సమర్పించారు. పద్మశ్రీ ప్రసాదరావు కేకును కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవికుమార్, పార్టీ నాయకులు లక్కోజు రాజగోపాలాచారి, అచ్యుత గౌడ్, కిలారి దుర్గారావు, సప్పా మోహన్ మురళి, బంకురు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

- 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం నగరంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం - కొవ్వూరు వైపు నుంచి ఏలూరు వైపు వచ్చే పెద్ద వాహనాలు వంగూరు హైవే వద్ద నుంచి ఏలూరు లోపలికి రావాలని, ద్విచక్రవాహన చోదకులు తూర్పు లాకుల రైల్వేగేట్ నుంచి తంగెళ్లమూడి వైపు, రైల్వే స్టేషన్ వద్ద కోడేలు బ్రిడ్జిపై నుంచి ఒన్‌టౌన్లోకి రావాలని సూచించారు. వట్లూరు వైపు నుంచి తాడేపల్లిగూడెం, కొవ్వూరు వైపు వెళ్లే వారు సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ వద్ద నుంచి శనివారపు పేట మీదుగా దుగ్గిరాల హైవేకి వెళ్లాలని పేర్కొన్నారు. సభకు వచ్చే వాహన చోదకులు ఏలూరు పాత బస్టాండు వద్ద ఆదిత్య ప్రిన్స్ హోటల్ రోడ్డు, కోమల విలాస్ రోడ్డు, ఆశ్రం వైపు నుంచి వచ్చేవారు పాత బస్టాండు పక్కన పాండురంగ పురం రోడ్డు, చాటపర్రు, ఏలూరు ఒన్‌టౌన్ ప్రాంతాల నుంచి వారు ఒన్‌టౌన్ మార్కెట్ రోడ్డులో వాహనాలను పార్కింగ్ చేయాల్సుంటుందని తెలిపారు.

నేడు నగరంలో వారాహి యాత్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వారాహి యాత్రలో భాగంగా జనసేనాని పవన్ కల్యాణ్ ఆదివారం మధ్యాహ్నం ఏలూరు నగరానికి విచ్చేస్తారు. స్థానిక క్రాంతి కల్యాణ మండపంలో జనసేన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి సత్రంపాడు అండర్ పాస్, శాంతి నగర్ మీదుగా కొత్తబస్టాండు, ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు యాత్ర చేరుకుంటారు. అక్కడి నుంచి శ్రీనివాస థియేటర్ రోడ్డులో ప్రవేశించి, పవర్‌పేట స్టేషన్ రోడ్డు, కొత్తపేట, నూకాలమ్మవారి ఆలయం, ఆదివారపు పేట, ఏఎస్ఆర్ స్టేడియంల మీదుగా స్థానిక పాత బస్టాండు వద్దకు చేరుకుని సాయంత్రం 5 గంటలకు పాత బస్టాండు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో మాట్లాడారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	90	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07-10
బెండకాయలు	36	కంద	40
పచ్చిమిర్చి	90-96	బీట్‌రూట్	40
కాకర కాయలు	40-60	కీరా దోస	60
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	48	అల్లం	250
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	28	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణీ	--
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	09
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	06
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	30
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	28
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత శ్రీనివాస్


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత పసుమర్తి శ్రీనివాస్‌కు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరు మండలంలో టీడీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ మండల నాయకుడు, గోపన్నపాలెం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పసుమర్తి శ్రీనివాస్ దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వ్యవసాయ సలహా మండలి దెందులూరు మండల చైర్మన్ కొండేటి గంగాధరబాబు, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శ్రీనివాస్ మెడలో పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని శ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు ఉన్నారు.

పథకాల అమలు ఘనత సీఎం జగన్‌దే

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తోన్న ఘనత దేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నవ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి అన్నారు. శనివారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెరుపుతూ రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల నిధులు జగన్ తీసుకురావడం అభినందనీయమన్నారు. రాష్ట్రాన్ని నిలువునా చీల్చడానికి మద్దతు ఇవ్వడంతో పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేవాల్సింది పోయి ప్రత్యేక ప్యాకేజీకి ఆమోదం తెలిపి చరిత్ర హీనుడుగా ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు నిలిచిపోయారని ఆరోపించారు. గతంలో బీజేపీతో పొత్తుకోసం ఆ పార్టీ నాయకుల కాళ్లు పట్టుకున్న వ్యక్తి ఈ రాష్ట్రానికి అవసరమా అని ఎద్దేవా చేశారు. ఇటీవల టీడీపీ మినీ మ్యానిఫెస్టోలో ముగ్గురు పిల్లలున్నా ముగ్గురికీ అమ్మఒడి ఇస్తానని చంద్రబాబు ప్రకటించడం చైతన్య, నారాయణ సంస్థల లబ్ధి కోసమే అని అనుమానం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న చంద్రమౌళి

కులాల ప్రాతిపదికన ప్రజల మధ్య చిచ్చుపెట్టడానికి పవన్ కల్యాణ్ చేస్తోన్న ప్రయత్నాన్ని బహుజనలు వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం ఏలూరులో పవన్ కల్యాణ్ చేపట్టే యాత్రను, బహిరంగ సభను బహుజనులు అడ్డుకుంటారని తెలిపారు. పవన్ తన పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి చేసే అభివృద్ధిని చెప్పకపోవడం చూస్తే అతనికి అవగాహన లేదని అర్థమౌతోందన్నారు. అతని సామాజికవర్గమే అతనిని ఒదిలేసిందని, అతనిది జనసేన కాదు కాపుసేన మాత్రమే అని అభిప్రాయపడ్డారు. టీడీపీ, జనసేన ఏకమైనా జగన్ విజయాన్ని ఆపలేరని వివరించారు.

ఉద్యమ సంస్థ ఎమ్మార్పీఎస్


ఎమ్మార్పీఎస్ అవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు రూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కుల సంఘం కాదని, ఉద్యమ సంస్థ అని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కందుల రమేష్ అన్నారు. శనివారం ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్, మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ అవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ జన్మదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బయ్యారపు రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెలాఖరులో హైదరాబాద్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కో కన్వీనర్ కాశీ కృష్ణ మాట్లాడుతూ మంద కృష్ణ ఆధ్వర్యంలో వికలాంగులకు ఆరోగ్యశ్రీ, పింఛన్, రేషన్ బియ్యం పెంపు, ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లు, భూ పంపిణీ, అట్రాసిటీ చట్టం పరిరక్షణకు పోరాటం చేశామని గుర్తుచేశారు. నాయకులు జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయినపర్తి మాధవరావు, గూడూరు రాజేష్‌బాబు, చొదిమెళ్ల బుజ్జి, బయ్యారపు కుటుంబరావు, నమ్మిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

జంగారెడ్డిగూడెం : వాహన చోదకులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎం.ధనుంజయుడు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించిన ఈ డ్రైవ్‌లో సుమారు 70 మంది చోదకులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా, వాహన నిబంధనలు పాటించకుండా, రాంగ్‌రూట్, త్రిబుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి గుర్తించామన్నారు. ఎక్కువగా యువత వాహన నియమాలు పాటించకుండా వాహనాలను నడుపుతున్నారన్నారు. ప్రస్తుతం నిర్వహించిన డ్రైవ్‌లో అవగాహన కల్పించామని, మరో సారి నిర్వహించే డ్రైవ్‌లో వాహనాలు సీజ్ చేయడంతో పాటు జరిమానాలు, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ పి.రాజేష్, ట్రాఫిక్ ఎస్సై పి.రామకృష్ణ, ఏఎస్సై ఎం.గంగాధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యూసీసీ కోడ్‌కు వైఎస్సార్ సీపీ వ్యతిరేకం

చింతలపూడి : యూసీసీ (యూనిఫాం సివిల్ కోడ్)కు తమ ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక షాదీఖానాలో శనివారం అంజుమన్ మహాఫిజుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీ శ్రీధర్‌బాబును శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. పార్లమెంట్‌లో యూసీసీకి వ్యతిరేకంగా ఓటు వేస్తామని చెప్పారు. ఖబరస్తాన్ గోడ నిర్మాణానికి ఎంపీ నిధులను కేటాయించడంపై ముస్లిం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. షాదీఖానాలో భోజన శాల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాలని ఎంపీ శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు.

